స్థాపితం : 1930 LONGEST LIVING NEWSPAPER IN TELUGU JOURNALISM

స్థాపకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు

జీవప్రదాత : నెల్లూరు శ్రీరామమూర్తి




# జమీన్‌రైతు

సంపుటి : 79 సంచిక 13 28-3-2008 శుక్రవారం 16 పేజీలు విడి ప్రతి : రూ. 5/-




# మోసపోయానని మథనపడుతున్న సీఎం!

డి.శ్రీనివాస్‌ను పిసిసి పీఠంపై ప్రతిష్టించాలని అధిష్టానం ఎందుకు నిర్ణయం తీసుకున్నది? దాని ద్వారా ఏ సంకేతం ఇవ్వదలచింది? ఈ ప్రశ్నలకు సమాధానాలు దొరకక ఇబ్బంది పడుతున్నారు రాష్ట్ర కాంగ్రెస్ వాదులు. ఎన్నికల సంవత్సరంలో పిసిసి పూర్తిగా తన అదుపాజ్ఞలలో నడవాలన్నది ముఖ్యమంత్రి అభిమతం. మొదట మల్లురవి, ఆ తర్వాత పొన్నాల లక్ష్మయ్య పేర్లు ప్రతిపాదించాడు. తన మాట కాదని పోదన్న ధైర్యంతో వుండినాడు. అట్లనే ఆరేడు నెలల కాలం గడిచిపోయింది. కానీ వున్నట్లుండి, కొంపలు మునిగిపోయినంత హడావుడితో తనను పిలిచి, పిసిసిని ఖరారు చేయడం ఆయన్ను బిత్తర పెట్టింది. ఎందుకిట్లా చేశారన్నది ఆయనకూ అర్థం కావడం లేదు. ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన తర్వాత చాలా ముభావంగా కనిపించాడు. అసెంబ్లీలో కూడా ఉదాసీనంగా కనిపించాడు. తన ఆప్తమిత్రుడు కెవిపి రామచంద్రరావుకు రాజ్యసభ సభ్యత్వం ఇప్పించుకోవడంతో కల్గిన ఆనందం పది రోజులలోనే ఆవిరై పోయింది.

ఈ పరిణామానికి కారకుడు జైపాల్‌రెడ్డి అని విన్పడుతున్నది. ఇప్పటికీ మహా బలవంతుడిగా వున్న ముఖ్యమంత్రి, పిసిసి కూడా ఆయన కోరినట్లే ఇస్తే, పట్టపగ్గాలు వుండవని సోనియా గాంధీ చెవిలో వూదాడట జైపాల్‌రెడ్డి.

## ఏ రాయి కావాలో తేల్చుకో!

పిసిసి అధ్యక్షుడి నియామకం విషయంలో వీరప్ప మొయిలీ ముఖ్యమంత్రిని పిల్చి, వి.హనుమంతరావు, డి.శ్రీనివాస్‌లలో ఒకరిని ఎంచుకోమన్నాడట. ఆ మాటకు ముఖ్యమంత్రి ముఖం మాడి పోయింది. కానీ ఏమీ చేయలేని పరిస్థితి. ఇద్దరూ తనకు పంటి క్రింద రాయివంటి వారే. ఏది మెత్తటి రాయో ఎంచుకోవడం తప్ప, పళ్లూడగొట్టే రాళ్ల నాకెందుకంటే విన్పించుకునేవారు లేకపోవడంతో డి.శ్రీనివాస్‌కు టిక్ కొట్టాడు సిఎం.

కడివెడు పాల కుండలో చిటికెడు ఉప్పు చిలకరించడంలో సోనియా రాజకీయ కార్యదర్శి అహ్మద్ పటేల్ కూడా తన వంతు పాత్ర పోషించినట్లు చెప్తున్నారు. ఆయనకు, ముఖ్యమంత్రికి మొదట నుంచీ సత్సంబంధాలు లేవు. వీరప్ప మొయిలీ కూడా తమను మోసం చేశాడని కెవిపి శిబిరం వాపోతున్నది. మొయిలీ తలచుకుని వుంటే డిఎస్ నియామకాన్ని ఆపడం పెద్ద కష్టం కాదని వారి భావన.

తెలంగాణా సీనియర్ల గోల తగ్గించడానికి సిఎం మనిషి కాని తెలంగాణా వాదిని అందలం ఎక్కించడం సరైన చర్యగా భావించింది అధిష్టానం. ఆ రకంగా వారిని కొంత మేర మచ్చిక చేసుకోవచ్చునని ఆశపడి వుండవచ్చు. రేపటి ఎన్నికలలో వారి అవసరం వున్నా లేకపోయినా, వారి గోల వల్ల ఎంతో కొంత నష్టం తప్పదన్నది నిజం. ఆ కొంత నష్టం కూడా ఎందుకని ఈ మార్గం అనుసరించినట్లున్నారు.

డిఎస్ నియామకం వల్ల రాజశేఖరరెడ్డి అధికార ప్రాభవానికి ఇప్ప

తరువ 4వ పేజీలో

## అసెంబ్లీ రద్దు తప్పదా?

రాష్ట్ర శాసనసభను రద్దు చేసి, ముందస్తు ఎన్నికలు జరపాలన్న ముఖ్యమంత్రి ప్రతిపాదనకు అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ అందినట్లు తెలుస్తున్నది. పిసిసి నియామకం పై చర్చకు ఢిల్లీకి వచ్చిన వైఎస్‌తో ఈ ముచ్చట కూడా ప్రస్తావించారట. అందుకు నువ్వు సిద్ధమేనా, వేరే ఆలోచన ఏదైనా వుందా అని అడిగారట. మళ్లీ అధికారంలోకి సులువుగా రావాలంటే ఇంతకు మించిన తరుణం వేరే వుండదని, మీరు సరే అంటే, ఏప్రిల్ నెలలోనే అసెంబ్లీ రద్దు చేస్తానని చెప్పాడట ముఖ్యమంత్రి. దానికి వారు తల వూపారని ఇంద్రప్రస్థ వేగుల వర్తమానం. చిరంజీవి రాజకీయ ప్రతిపాదనలకు పురిటిలోనే సంధి కొట్టించాలన్నా; తెలంగాణా ఉప ఎన్నికలు నివారించాలన్నా శాసన సభ రద్దు కంటే మెరుగైన మార్గం ఏదీ లేదని ముఖ్యమంత్రి మొదట నుంచీ చెప్తూనే వున్నాడు. కాపులను బిసిలలో చేర్చే విషయంలో సర్వే నిర్ణయాన్ని అంత త్వరపడి తీసుకోవడంలోని ఆంతర్యం కూడా అదేనని పరిశీలకుల ఊహ. ఎమ్మెల్యేలు మాత్రం తమ పదవులు అర్ధాయుష్షుతో ముగిసి పోవడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు.

## నాడు శివాలయం... నేడు వైష్ణవాలయం!

నేను పిసిసి అధ్యక్షుడిగా వున్న రోజులలో గాంధీభవన్ శివాలయం వంటిది. ఇప్పుడు డి.శ్రీనివాస్‌కు మాత్రం వైష్ణవాలయం దొరికింది, అన్నాడు ఎం.సత్యనారాయణరావు. డిఎస్ నియామకం వార్త రాగానే, అసెంబ్లీ లాబీలలో కన్పించిన విలేఖరులతో ఈ మాట అన్నాడాయన. శివాలయంలో బూడిద తప్ప మరేమీ వుండదు. వైష్ణవాలయంలో ప్రతి పూటా చక్కెర పొంగలి, పులిహోర దొరుకుతాయి. గత ఎన్నికలకు ముందు, చంద్రబాబు జోరుగా వున్న రోజులలో పిసిసి నిర్వహణ అంటే, జీతభత్యాలకు కూడా వెతుక్కోవాల్సిన కటకట. అప్పట్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్న ఆశ ఎవరికీ లేదు కాబట్టి, గాంధీ భవన్‌లో కొత్త ముఖం కన్పడేది కాదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వుంది. మళ్లీ అధికారంలోకి రాబోతుందన్న ప్రచారంతో వుంది. జీత భత్యాలకు కోరినంత సొమ్ము కుప్ప బోస్తున్నాడు ముఖ్యమంత్రి. రేపటి ఎన్నికలలో టిక్కెట్ల కోసం జలయజ్ఞం కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు పోటీలు పడుతున్నారు. కొన్ని నియోజక వర్గాలలో కాంగ్రెస్ టిక్కెట్ రేటు కోట్లలో పలుకుతున్నది. తన చేతితో టిక్కెట్ ఇవ్వబోతున్న డిఎస్ పంట పండినట్లే లెక్క. అందుకే ఆయనకు వైష్ణవాలయం దొరికిందని అసూయ పడుతున్నాడు ఎంఎస్ఆర్.






# సిఎంలో సంతోషం!

పునాది వేసిన చేతితోనే ప్రారంభోత్సవం చేయగలగడం గొప్ప అదృష్టం. ప్రారంభం తర్వాత ఆ సంస్థ దిన దిన ప్రవర్ధమానమయ్యే భాగ్యాన్ని కూడా అదే పదవీ కాలంలో చూడగలగడం మరింత విశేషమైన అదృష్టం. ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి అటువంటి భాగ్యవంతుడు. స్వర్ణముఖి బ్యారేజికి శంకుస్థాపన చేసింది ఆయనే; మొన్న 21తేది రిబ్బను కత్తిరింపు చేసింది కూడా ఆయనే. ఈ బ్యారేజి నిర్మాణం కోసం వాకాడు పరిసర గ్రామాల

## శంకుస్థాపించినవి ప్రారంభించడంతో ...

ప్రజలు కొన్ని దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నారు. కానీ ఎవరి వల్ల కాలేదు. జనార్ధనరెడ్డి గారు ముఖ్యమంత్రిగా దానికి మంజూరు ఇచ్చినా, ఆయన దిగి పోగానే మెలికపడి ఆగిపోయింది. ఆ కొరత మనసులో పెట్టుకున్న జనార్ధనరెడ్డి వైఎస్ జలయజ్ఞం మొదలు కాగానే, పట్టుబట్టి, దీనికి మంజూరు ఇప్పించుకున్నాడు. కాంట్రాక్టర్ల మెడల మీద కూర్చుని పూర్తి చేయించాడు. ఒక్క రోజు ఆలస్యం జరిగినా తన స్వప్నం సాకారం కాదేమోనన్న ఆందోళన వ్యక్తమైంది జనార్ధనరెడ్డిలో. ప్రారంభసభ విషయంలోనూ అదే ఆదుర్దా. ఆరోగ్యం సహకరించక పోయినా పట్టించుకోకుండా సభ ఏర్పాట్లు చూశాడు. జలయజ్ఞంలో నిర్మితమౌతున్న భారీ ప్రాజెక్టులతో పోలిస్తే, ఇది చాలా చిన్నది. కానీ, జనార్ధనరెడ్డికి మాత్రం అది జీవిత లక్ష్యం వంటిది. ఆయన ఉపన్యాసంలో కూడా ఆ ఆర్ధత వ్యక్తమైంది.

తడలో అపాచి చెప్పుల కర్మాగారంలో ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి అటువంటి భావోద్వేగానికి లోనైనారు. దీనికి శంకుస్థాపించింది ఆయనే; ప్రారంభించింది కూడా ఆయనే. ఆ అభిమానంతో ఫ్యాక్టరీ పనితీరు ఎట్లా వుందో చూడడానికి అక్కడకు వెళ్లారాయన. అక్కడ పని చేసే వారితో చాలా సేపు ముచ్చట్లాడారు. చాలా ఆనందం పొందారు.

ముఖ్యమంత్రి ఈసారి జరిపిన నెల్లూరు జిల్లా పర్యటన మొత్తం, సంతృప్తికరంగా, సంతోషంగా జరిగింది. సభలు జరిగిన ప్రతి చోటా ప్రజలు కూడా సానుకూల స్పందన చూపారు. ఆయన ప్రసంగానికి చప్పట్లతో మోత మోగించారు. ఎన్నికలు దగ్గర పడిన సమయంలో తనను ప్రజలు అంత ఘనంగా ఆదరించడం ముఖ్యమంత్రికి ఎక్కడలేని ఆనందం కల్గించింది. ఎమ్మెల్యేలు కూడా సంతోషంగా కనిపించారు. వీరేమి అడిగినా ముఖ్యమంత్రి మంజూరు చేసి పారేస్తున్నప్పుడు, ఎమ్మెల్యేలకు సంతోషం సహజమే కదా?

కార్యకర్తలలో మాత్రం ఆ సానుకూలత లేదు. వారికి అన్నిటా అసంతృప్తే. నెల్లూరులో జరిగిన కార్యకర్తల సభలో కూడా వారికి ఎవరికీ కనీసం మాట్లాడే అవకాశం దొరకలేదు. నిలయ విద్వాంసుల వాద్య గోష్టి వలె, నేతలే మైకును కౌగిలించుకున్నారు.



నెల్లూరు విజయడైరీలో రిటైర్డ్ సూపర్‌వైజర్ గుడ్లూరు రమణప్రసాద్, రేణుకల కుమారుడు హైదరాబాద్ హెచ్ఎస్‌బిసిలో సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కృపాకర్, వెంకట సంధ్యాగాయత్రిల వివాహం 21తేది నెల్లూరు డిఎస్ఆర్ కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది.

## ఆనం బ్రదర్సా... మజాకా!

ఏ గాలి తోలితే ఆ దిక్కు చాప ఎత్తడం తెలివైన రాజకీయవాది లక్షణం. ఆ విద్యలో తమకు సాటి రాగల వారు ఎవరూ లేరని చాటి చెప్పారు ఆనం సోదరులు. 22తేది ఉదయం జరిగిన కార్యకర్తల సమావేశంలో నేదురుమల్లి జనార్ధనరెడ్డిని ఆకాశానికెత్తాడు ముఖ్యమంత్రి వైఎస్. పెద్దాయన అనుభవంతో ఇచ్చే సలహాలు తనకు శిరోధార్యం అన్నాడు. ఆ మాట వినడమే తడవు, ముఖ్యమంత్రి హెలికాప్టర్ ఎక్కగానే ఇద్దరూ కల్సి జంటగా నేదురుమల్లి ఇంటికి వెళ్లి రెండు గంటలపాటు రకరకాల విన్యాసాలు చేశారు. నిన్నటివరకు తాము ఇదే జనార్ధనరెడ్డిని, మంత్రి రాజ్యలక్ష్మమ్మను ఏ భాషలో ఆడిపోసుకున్నదీ, ఎన్ని వ్యంగ్య వ్యాఖ్యలు చేసింది, పెద్దాయన అని కిందలు పట్టించిందీ, అన్నీ మర్చిపోయారు. జనార్ధనరెడ్డి కూర్చోబోతుంటే అన్నగారు కుర్చీ పట్టుకుంటే, కారెక్క బోతున్నప్పుడు తమ్ముడు గారు తలుపు తీసి పట్టుకున్నాడు. ఆ విశేషాలు చూసి అక్కడే వున్న కాంగ్రెస్ వాదులకు కలిగిన వెగటు అంతా ఇంతా కాదు.

## మథనపడుతున్న సిఎం

మొదటి పేజీ కొరవ

టికిప్పుడు వచ్చే ముప్పు ఏమీ లేదు. అధిష్టానం ఎటువంటి సంకేతాలిచ్చినా ఎమ్మెల్యేలు మాత్రం ఆయన్నే అంట కాగుతున్నారు. ఆయన మీద ఈగ వాలినా సహించే స్థితిలో లేరు. అందువల్ల ప్రభుత్వ నిర్వహణలో చీకాకు లేమీ వుండవు. ఎన్నికలలో టిక్కెట్ల పంపకంలో మాత్రమే కొంత ఇబ్బంది కల్గవచ్చు. రేటు పెట్టి కొనాలని చూసే వారంతా డిఎస్ చుట్టూ మూగడం ఖాయం. వారికోసం ఆయన వత్తిడి తెచ్చినా, తనకు ఇష్టం లేని సిట్టింగ్ ఎమ్మెల్యేల మార్పుకు అడ్డుతగిలినా సమస్య తలెత్తే అవకాశం వుంది. కానీ దేనినైనా, ఎవరినైనా డబ్బుతో లొంగ దీసుకోగల సత్తా రాజశేఖరరెడ్డికి కూడా పుష్కలంగా వుంది కాబట్టి, డిఎస్‌ను నిలువరించడం పెద్ద కష్టం కాక పోవచ్చు.

తాను ఢిల్లీ వెళ్లి, సోనియాను కలిసే వరకు డిఎస్ పేరు బయటకు రాకపోవడం, తను అక్కడ వుండగానే డిఎస్ ప్రత్యక్షం కావడం సిఎంను బాధ పెడుతున్నాయి. ఒక్క నెల క్రమం తప్పకుండా తానందించే మూటలు పుచ్చుకొంటున్న ఢిల్లీ పెద్దలు, ఏ మాత్రం కృతజ్ఞత లేకుండా తనను అవమానించడం ఎందుకని ఆయన ఆవేదన. ఇప్పుడే ఇట్లా చేసిన వారు రేపు టిక్కెట్ల పంపిణీలో ఇంకెన్ని మతలబులు సృష్టిస్తారో అన్నది భయం.

ఇదిట్లా వుంటే ఎన్నికలలో కాంగ్రెస్ గెలిచి మళ్లీ అధికారంలోకి వచ్చినా, హంగ్ అసెంబ్లీ ఏర్పడినా కర్ణాటక, మహారాష్ట్రలలో వలె చివరి నిముషంలో తెలంగాణా పేరు చెప్పి డిఎస్‌ను పోటీకి తెస్తారేమోననే గుబులు కూడా సిఎంలో కలుగుతున్నది. ఎమ్మెల్యేలు తనకు కొండంత అండగా వుంటారన్నది నిజమే అయినప్పటికీ, సోనియా పేరుతో నాటకం నడిపితే ప్రమాదం కదా అన్నది అనుమానం. డిఎస్‌ను పెట్ట దలిస్తే నేరుగా తనకే ఆ మాట చెప్పకుండా ఇంత మోసపూరితంగా వ్యవహరించడం ఎందుకని మథన పడుతున్నాడు ముఖ్యమంత్రి.


**పొలము అమ్మబడును**

నెల్లూరు జిల్లా ఇఫ్‌కో కిసాన్ సెజ్ పగర విడవలూరు మండలంలో మంచినీటి వసతి కలిగిన 28 ఎకరముల మాగాణి పొలము (వరి, చెరకు, అరటి మొ॥ అన్నిరకాల పంటలకు అనువైన పాటి మట్టి నేల) అమ్మకమునకు కలదు.

Cont : 94404 39583
08622 - 222353








# బూడిద ప్లాంట్ భూసేకరణలోనూ కుంభకోణం!

కృష్ణాపట్నం పరిసర ప్రాంతాల్లో పారిశ్రామికీకరణతోపాటు లెక్కలేనన్ని కుంభకోణాలు చోటు చేసుకొంటున్నాయి. తిలాపాపం తలా పిడికెడన్నట్టు ఈ కుంభకోణాల్లో లబ్ధిదారులు, దళారులు, రెవిన్యూ అధికారులు, అధికార పార్టీ నేతల ప్రమేయం వుండడంతో అంత సులభంగా బయట పడడం లేదు. అన్ని వ్యవహారాలను మసిపూసి మారేడు కాయ చేస్తున్నారు. కృష్ణపట్నం ఆల్ట్రామెగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నిర్మిస్తే అందులో నుంచి వచ్చే బూడిదను నిల్వ చేసేందుకు తోటపల్లి గూడూరు మండలం మండపం పంచాయితీ పరిధిలో నిర్మించ తలపెట్టిన ప్రత్యేక ప్లాంట్ నిర్మాణం కోసం సేకరించిన భూముల్లోనూ కోట్లాదిరూపాయలు చేతులు మారాయి. ఈ బూడిద ప్లాంట్‌లోనే ఈ వ్యవహారాలను సమాధి కట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అభివృద్ధి జరుగుతున్న చోట గోరంత అవినీతి జరుగుతుందని ముఖ్యమంత్రి మొదలు అధికార పార్టీ నేతలు చెబుతుండగా మండపంలో మాత్రం కొండంత జరిగింది. జిల్లాలో ఇప్పటివరకు తడ మండలం మేనకూరులో టెక్స్‌టైల్స్ పార్కు, చిల్లకూరు మండలం చింతవరం వద్ద మాస్ హోల్డింగ్ ఆధ్వర్యంలో అప్పెరల్ టెక్స్‌టైల్ పార్కు, ముత్తుకూరు మండలంలో కృష్ణాపట్నంపోర్టు, ఆల్ట్రా మెగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రం, టి.పి. గూడూరు మండలంలో మండపం పంచాయితీ పరిధిలో బూడిద ప్లాంట్ యాష్ పాండ్ కోసం వేలాది ఎకరాల భూములు ప్రభుత్వం సేకరించింది.



బూడిద ప్లాంట్ నిర్మాణానికి సేకరించిన పంట బాగా పండే భూమి.

పై పరిశ్రమలలో తడ మండలం వద్ద నిర్మించిన అపాచి బూట్ల తయారీ కంపెనీ తీసుకున్న భూములకు రైతులకు నష్టపరిహారం చెల్లించడం జరిగింది. కృష్ణపట్నం పోర్టు నిర్మాణం, మెగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, యాష్‌పాండ్ కోసం సేకరించిన భూములు, మేనకూరు టెక్స్‌టైల్ నిర్మించేందుకు తీసుకున్న భూములకు చెల్లించే నష్టపరిహారం విషయంలో పలు అవినీతి, అక్రమాలు జరిగాయి. చిల్లకూరు మండలం చింతవరం వద్ద మాస్ అప్పెరల్ టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకోసం సేకరించిన భూములకు ఇంతవరకూ రైతులకు ఎటువంటి నష్ట పరిహారం అందలేదు.

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాను పారిశ్రామికంగా ముందుకు తీసుకెళ్లాలన్న సంకల్పంతో ప్రయివేటు సంస్థల ఆధ్వర్యంలో పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అయితే ఈ అవకాశాన్ని తమకు ఆర్థిక వనరుగా మలచుకుంటున్నారు అధికారులు, దళారులు.

పరిశ్రమలు స్థాపించే మండలాల్లో విధులు నిర్వహించే రెవిన్యూ అధికారులు తక్కువ కాలంలో కోట్లకు పడగలెత్తుతున్నారు. అధికార పార్టీ అండదండలున్న చోటా రాజకీయ నాయకులు దళారుల అవతారం ఎత్తడం అధికారులకు కలిసి వస్తుంది.

నిన్న మొన్నటి వరకు తడ, మేనకూరు, చిల్లకూరు, ముత్తుకూరు మండలాల రెవిన్యూ అధికారులు, అక్కడి రాజకీయ దళారులే అవినీతి, అక్రమాలకు పాల్పడుతుండగా, తాజాగా టి.పి.గూడూరు మండలం తహశీల్దార్ కార్యాలయం ఈ అవినీతి రికార్డులలో చేరిపోయింది.

> కృష్ణాపట్నం పరిసర ప్రాంతాల్లో పారిశ్రామికీకరణ కుంభకోణాలు ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి. భూసేకరణ పేరిట నిర్లజ్జగా ప్రజాధన స్వాహా జరిగిపోతుంది. తోటపల్లిగూడూరు మండలం మండపం గ్రామంలో ఏర్పాటు చేయతలపెట్టిన బూడిద ప్లాంటే దీనికి నిదర్శనం.

కృష్ణాపట్నం సమీపంలో ఆల్ట్రా మెగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నిర్మిస్తే ఇందులో నుంచి అధిక శాతం బూడిద వెలువడుతుంది. ఈ బూడిదను నిల్వ చేసి తరలించేందుకు తోటపల్లిగూడూరు మండలం మండపం పంచాయితీ పరిధిలో బూడిద ప్లాంట్ నిర్మాణం కోసం ప్రభుత్వం 775 ఎకరాలు సేకరించింది.

వీటిలో 275 ఎకరాలు పట్టా భూములు కాగా మిగిలినవి సిజెఎఫ్ఎస్, అస్సైన్‌మెంట్ భూములు. ఈ భూములు సేకరించే దగ్గర నుంచి రైతులకు నష్టపరిహారం పంపిణీ చేసేవరకు రెవిన్యూ అధికారులు అంతా గోప్యంగానే వ్యవహరించారు.



కుంభకోణాలకు నెలవైన తోటపల్లిగూడూరు తహసీల్దార్ కార్యాలయం.

సర్వేపల్లి శాసనసభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి అనుచరులు, రెవిన్యూ అధికారులను మభ్యపెట్టి తాము సూచించిన విధంగా రైతులకు నష్టపరిహారం అందించే విధంగా వత్తిడి తెచ్చారు. అసలే అధికార పార్టీకి చెందిన నాయకులు, ఆపై ఎమ్మెల్యే అండదండలు పుష్కలంగా వుండడంతో తహశీల్దార్ వారు చెప్పిన విధంగా చేయక తప్పలేదు. ఫలితంగా లక్షలాది రూపాయలు చేతులు మారగా, మరో కోటి రూపాయలకు పైగా రాబట్టుకొనే పనిలో తలమునకలై వున్నారు.

బూడిదప్లాంట్ నిర్మాణం కోసం సేకరించిన భూములను పరిశీలించి, రైతుల ఇబ్బందులు తెలుసుకునేందుకు "జమీన్‌రైతు" విలేకరుల బృందం తోటపల్లిగూడూరు మండలంలో పర్యటించడం జరిగింది.

మండపం, గొల్లపాళెం, ఆదాలపురం, చంద్రశేఖరపురం తదితర గ్రామాలలోని రైతులు నష్టపరిహారం పంపిణీలో పలు అక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది, వీఆర్‌ఓలు రైతులను పలు రకాలుగా ఇబ్బంది పెడుతూ కార్యాలయం చుట్టూ త్రిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం

కొరకు 14వ పేజీలో

## ఆఫీసు చుట్టూ తిరగలేకున్నాం

బూడిద ప్లాంట్ కోసం ప్రభుత్వం తీసుకున్న భూములకు నష్టపరిహారం చెల్లించేందుకు తోటపల్లి గూడూరు తహశీల్దార్ కార్యాలయం చుట్టూ అధికారులు త్రిప్పుకుంటున్నారు. 30 ఏళ్ల క్రితం ప్రభుత్వం పంపిణీ చేసిన సీలింగ్ భూములకు సంబంధించిన రికార్డులు లేవన్న సాకుతో అధికారులు లబ్ధిదారుల్ని ఇబ్బంది పెడుతున్నారు.



రమణయ్య, గొల్లపాళెం.

## మామూళ్లు అడుగుతున్నారు!

బూడిదప్లాంట్ నిర్మాణం కోసం పేద ప్రజలకు పంపిణీ చేసిన భూములను ప్రభుత్వం తీసుకుంది. ఈ భూములకు ధర నిర్ణయించి, నష్టపరిహారం చెల్లించేందుకు రెవిన్యూ అధికారులు మామూళ్లు అడుగుతున్నారు. ఈ మామూళ్లను రాజకీయ దళారుల ద్వారా వసూలు చేయాలని ప్రయత్నిస్తున్నారు. పేదలకు న్యాయం జరిగే విధంగా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలి.



వెంకటసుబ్బయ్య, సిఎస్‌పురం.




## జూదగిరిగా వెంకటగిరి!

వెంకటగిరి పట్టణ పరిధితోపాటు చుట్టుప్రక్కల ప్రాంతాల్లో నాటుసారా తయారీ, అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. ఇదే స్థాయిలో లక్ష లాది రూపాయలు పెట్టించి జూదం జోరుగా జరుగుతుంది. ఎక్సైజ్ అధికా రులు, పోలీసులకు తెలిసినా, చూసీ చూడనట్లు వుంటుండడంతో నాటు

### ఎవరికీ పట్టదా?

సారా తయారీ వ్యాపారం అడ్డూఅపు లేకుండా జరుగుతున్నది. పలుచోట్ల పేకాట స్థావరాలు ఏర్పాటవడంతో చుట్టుప్రక్కల ప్రాంతాల వారు ఇక్కడకు వచ్చి లక్షలు పెట్టి పేకాట ఆడి ఇళ్లు, ఒళ్లు గుల్లచేసుకొంటున్నారు. దీంతో గొడవలు, కొట్లాటలు పెరిగిపోయాయి. ఈ కోవకు చెందినదే విశ్వోదయ జూని యర్ కాలేజి అటెండర్ ఆవుల రాధయ్య హత్య. గత నెలలో జరిగిన ఈ హత్యకు కారణం తాగుడు, జూదం వ్యసనాలే కారణమని ప్రచారం జరుగుతోంది.

తరువ 14వ పేజీలో



నెల్లూరులో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సభలో కృష్ణపట్నం పోర్ట్ నిర్మాణం వల్ల నిర్వాసితులైన కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగ అవకాశాన్ని కల్పించాలని కోరుతూ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డికి వినతి పత్రాన్ని ఇస్తున్న యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పి.కోటీశ్వరరెడ్డి.

## మరుభూముల ఆధునీకరణ

వెంకటగిరి మునిసిపాలిటీలోని స్మశానాలలో కనీస వసతులు కల్పిం చేందుకు కౌన్సిల్ నడుం బిగించింది. ఇటీవల జరిగిన వెంకటగిరి మునిసిపా లిటీ అత్యవసర సమావేశంలో ఛైర్మన్ చంద్రమోహన్, ఇతర సభ్యులు ఈ విష యమై ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. పట్టణంలోని హిందూ, ముస్లిం, క్రిస్టి

### ప్రజల హర్షం

యన్ స్మశానాలను ఆధునీకరించేందుకు, మంచినీరు, షెల్టర్లు, ఫెన్సింగ్ నిర్మాణాలు చేపట్టనున్నారు. బిల్డింగ్, లే అవుట్స్ రెగ్యులరైజేషన్ స్కీం క్రింద ఈ పనులు జరుగనున్నాయి. దీనితోపాటు వెంకట గిరి పట్టణంలోని విద్యార్థిని, విద్యార్థుల కోసం స్విమ్మింగ్ పూల్‌ను నిర్మించేం దుకు కౌన్సిల్ నిర్ణయం తీసుకొంది. మొత్తం 68లక్షలతో నిర్మాణాలు, ఆధు నీకరణలు చేపట్టనున్నారు. పట్టణంలోని పాలకవర్గం స్మశానాల ఆధునీకరణ, వస తుల కల్పనకు చొరవ తీసుకోవడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కావలిలో పాస్‌పోర్టు ఆఫీసు!

దేశస్థాయిలో ఎక్కడాలేని విధంగా కావలి ప్రధాన తపాలా కార్యాల యంలో పాస్‌పోర్టు జారీ ప్రాసెసింగ్ కేంద్రం ఏర్పాటయింది. ఇప్పటి వరకు జిల్లా కేంద్రాలలో మాత్రమే పాస్‌పోర్టు జారీ కేంద్రాలు వుండేవి. దేశంలోనే ప్రప్రథమంగా డివిజన్ స్థాయిలో పాస్ పోర్టు జారీ కేంద్రం ఏర్పాటు కావడం విశేషం. విదేశాలకు వెళ్లేందుకు యువత ఉత్సుకత ప్రదర్శిస్తున్న దశలో పాస్ పోర్టు జారీ ప్రక్రియ వేగవంతం చేసేం దుకు డివిజన్ స్థాయిలో పాస్‌పోర్టు జారీ కేంద్రం నెలకొల్పడం వెనుక హైద రాబాద్ రీజనల్ పాస్‌పోర్టు అధికారి బాలభాస్కర్ పాత్ర చాలావుంది. కావలి

### పాస్‌పోర్ట్ అధికారి చొరవే కారణం

ఆయన సొంత ఊరు కావడమే దీనికి కారణమంటున్నారు. మార్చి 19న జరి గిన ఈ పాస్‌పోర్టు కార్యాలయం ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే పార్వతమ్మ, పాస్‌పోర్టు అధికారి బాలభాస్కర్, తపాలాశాఖ జిపి వెంకటేశ్వరరావు, పోస్టల్ సూపరింటెండ్ శివప్రసాద్ హాజ రయ్యారు. ఈ కేంద్రంలో 20 రూపా యలకు పాస్‌పోర్టు దరఖాస్తులు లభి స్తాయి. వెయ్యి రూపాయలు ఫీజు చెల్లించి అవసరమైన సర్టిఫికెట్లు సమ ర్పించినట్లయితే పోలీస్ ఎంక్వయిరీకి సైతం తపాలాశాఖ నుంచే పంపబడు తుంది. కావలి చుట్టుప్రక్కల ప్రాంతాల యువకులకు ఇది చాలా మేలు కల్గించే అంశం.



ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు నెల్లూరులో అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిఎంఎస్ ప్రాజెక్ట్ అధికారి ఎస్.ఎం.పుస్తి. ప్రక్కన కలెక్టర్ కె.రాంగోపాల్, ఎస్పీ మల్లారెడ్డి.



నెల్లూరు హరనాథపురంలోని ఎస్.ఎస్.పి.ఇ- లెర్నింగ్ సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రథమ వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న సంస్థ డైరక్టర్ పెళ్లూరు రామయ్యనాయుడు. వేదికపై బి.శ్రీహరిరెడ్డి, డాక్టర్ సి.ఆర్.రెడ్డి, ఎస్వీరమణయ్య, కొండా బలరామిరెడ్డి, కె.వేణుగోపాల్ వున్నారు.

## మాట నిలబెట్టుకోని పోస్టల్ శాఖ

రాపూరు మండలం గుండవోలు పోస్టాఫీసులో ఆరు నెలల క్రితం ఆర్‌డి, ఎస్‌బి ఖాతాలో వున్న నగదు గల్లంతైన విషయం తెలిసిందే. డిపాజిట్ దారులు తమ ఖాతాల్లోని నగదు డ్రా చేసుకొనేందుకు వెళ్లి నగదు మాయమైన విషయం తెలుసుకొని గగ్గోలు పెట్టారు. ఖాతా దారుల పుస్తకాల్లో రాసి, పోస్టాఫీసు రికార్డుల్లో నమోదు చేయకుండా అక్కడి సిబ్బంది కొందరు స్వాహా చేయడం, ఖాతాదారులు నిలదీయడంతో ఉన్నతా ధికారులు జోక్యం చేసుకొని డిపా జిట్‌దారుల నగదు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఆరు నెలలు గడుస్తున్నా

### గుండవోలు గ్రామస్తుల లబోదిబో

ఇంతవరకు ఒక్క పైసా కూడా డిపాజిట్ దారులకు అందజేయక పోవడంతో కాళ్లరిగేలా తిరగడం తప్పితే పోస్టల్ అధి కారులు పట్టించుకోకపోవడంతో ఖాతా దారుల రోదనలు అరణ్య రోదనలు అవు తున్నాయి. పోస్టల్ శాఖ కూడా పరపతి పోగొట్టుకుంటే ఎలా? ఉన్నతాధికారులు ఈ విషయమై స్పందించాలి.

## గురుకులంలోనూ సమస్యలు

అనంతసాగరం మండలం సోమశిలలోని గురుకుల పాఠశాల విద్యార్థులు రోడ్డుపై అర్ధనగ్నంగా రాస్తారోకో చేయాల్సిన పరిస్థితి దాపురించింది. గురుకులంలో చదువుకొంటున్న విద్యార్థులు చాలా సంవత్సరాలుగా పలు ఇబ్బందులు పడుతు న్నారు. వీరికి వుండటానికి సరైన వసతి లేకపోవడం వల్ల సోమశిల ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో ఏర్పాటుచేసిన గోదాముల్లోనే ఈ చిన్నారులు చదువు కోవాల్సి వస్తోంది. వసతి కోసం పక్కా భవనాన్ని ఏర్పాటు చేయాలని పలు మార్లు ప్రజా ప్రతినిధులకు, ఉన్నతాధి కార్లకు మొరపెట్టుకున్నా ఎవరూ స్పం

### విద్యార్థుల రాస్తారోకో

దించక పోవడంతో విద్యార్థులు ఈనెల 20వ తేదీ రోడ్డెక్కి అర్ధనగ్నంగా రాస్తా రోకో చేపట్టారు. విద్యార్థులకు అదే ప్రాంతానికి చెందిన డివైఎఫ్‌ఐ కార్య కర్తలు మద్దతు ఇవ్వడంతో మండుటెం డలో అర్ధనగ్నంగా విద్యార్థులు అరగం టకు పైగా రాస్తారోకో చేశారు. కాని స్పందించే అధికారే లేరు.



వీరంపల్లి గ్రామంలో తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం బి.శ్రీహరిరెడ్డి నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ పి.ఎల్.రావు, వేదికపై డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ భారతి వున్నారు.

# ఛీ... ఛీ... ఎయిడ్స్ నిధులూ తినేస్తున్నారు!

దేశంలోని అత్యధిక జనాభాను పట్టిపీడిస్తున్న 14 రకాల వ్యాధులలో ఎయిడ్స్ ఒకటి. ఈ ప్రమాదకరమైన వ్యాధి నుంచి యువతీ, యువకులను కాపాడేందుకు ముందుగా వీరికి అవగాహన సదస్సులు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది.

ఈ మేరకు కేంద్ర కుటుంబ, వైద్య ఆరోగ్య శాఖకు నిధులు కేటాయించి శిక్షణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. హెచ్ఐవి, ఎయిడ్స్ గురించి ప్రచారం చేస్తున్నామని చెప్పుకుంటున్న కొన్ని స్వచ్ఛంద సంస్థలు నిధులు మంజూరు చేయించుకుని తర్వాత కనిపించకుండా పోతున్నాయి.

నిధులు మంజూరు చేయించుకుని కార్యక్రమాలు నిర్వహించని స్వచ్ఛంద సంస్థల పనితీరును పర్యవేక్షించాల్సిన బాధ్యత ఎయిడ్స్ కంట్రోల్ నోడల్ అధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులపై వుంది. అయితే పై శాఖల అధికారులు తమకెందుకులే అనే ఉదాసీన వైఖరితో నిధుల వ్యవహారం గురించి పట్టించుకోవడం లేదు.

దీంతో ప్రభుత్వ సంకల్పం, లక్ష్యాలు నెరవేరకుండా పోవడంతో పాటు ఎయిడ్స్, హెచ్ఐవి వ్యాధులు మరింత విస్తరిస్తున్నాయి. 2008-09 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేవలం హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధులపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు జిల్లాకు దాదాపు 20 లక్షల రూపాయల నిధులు విడుదలయ్యాయి.

ఈ నిధులు ఏమయ్యాయో జిల్లాలో హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధులు వ్యాపించడంపై పట్టించుకున్న అధికారులు లేరు.

అధికారుల తనిఖీలు, పర్యవేక్షణ లోపించడంతో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తు




నియంత్రణ కేంద్రం కాదు నిధుల స్వాహా కేంద్రం.

కూడా ఇంతవరకు అధికారులకు సమాచారం లేదు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను స్వచ్ఛంద సంస్థలతోపాటు ఎయిడ్స్ కంట్రోల్ నోడల్ అధికారి దారి మళ్లిస్తున్నారు. అసలు సంస్థల పరంగా బాధ్యతలు కలిగి వుండాలి. జిల్లాలో 18-30 సంవత్సరాల మధ్య వయస్సు గల యువకులు ఈ వ్యాధి బారిన పడుతున్నారు. వీరికి ఎయిడ్స్ వ్యాధి నివారణపై అవగాహన కల్పించే విధంగా విస్తృతంగా కార్యక్రమాలు రూపొందించి అమలు చేయాల్సి వుంటుంది.

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని యువకులకు ఈ వ్యాధుల వల్ల కలిగే ప్రమాదాల పట్ల చైతన్యవంతులను చేయాలి. గ్రామీణ ప్రాంతాలలో ఏ గ్రామంలో కూడా ఇప్పటివరకు అవగాహన సదస్సులుగానీ, శిక్షణ కార్యక్రమాలుగానీ ఏర్పాటు జరుగలేదు. యువత ప్రవర్తన, అలవాట్ల కారణంగా ఈ వ్యాధి బారిన పడుతుండగా, ఇందుకు భిన్నంగా మార్పులు తీసుకురావడానికి ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు.

గ్రామీణ ప్రాంతాలలో ప్రతి వెయ్యి మంది జనాభాకు ఒక "ఆశ" వాలంటీర్‌ను వైద్య, ఆరోగ్యశాఖ నియమించింది. ఆశ వాలంటీర్లందరూ మహిళలు కావడంతో వీరు ఎయిడ్స్, హెచ్ఐవి గురించి గ్రామస్తులకు వివరించి చెప్పడంలో సిగ్గు, బిడియం కనబరుస్తున్నారు. "ఆశ" వాలంటీర్లను నియమించారే తప్ప ఇక వారి గురించి పట్టించుకోవడంగానీ, సూచనలు, సలహాలు చేయడంగానీ చేయలేదు.

కేవలం డిసెంబర్ 1వ తేదీ ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సభలు, సమావేశాలు, విద్యార్థుల చేత ప్రదర్శనలు చేయిస్తారు. మిగిలిన రోజులలో హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితుల గురించి పట్టించుకునే దిక్కేలేదు.

అవగాహన సదస్సులు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని నిధులు రాబట్టుకుంటున్న స్వచ్ఛంద సంస్థలపై

తొరవ 14వ పేజీలో

సినిమా సమీక్ష

అల్లూరు రహీం

# ఆకట్టుకోని జాన్ అప్పారావ్ 40+

విలక్షణ దర్శకునిగా తెలుగు చిత్రసీమలో పేరుగాంచిన వంశీ తెలుగు తెరకు పరిచయం చేసిన మంచి హాస్య నటుడు కృష్ణభగవాన్. ఈయన్ను హీరో చేసి కూచిపూడి వెంకట్ తీసిన చిత్రమే జాన్ అప్పారావ్ 40+. ఒకే వ్యక్తి ఒక చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వంతో పాటు నిర్మాతగా వ్యవహరిస్తూ జనం మెచ్చేలా చిత్రం తీయడం చాలా కష్టం. జాన్ అప్పారావ్ 40+ వ్యవహారంలోనూ అదే జరిగింది. కామెడీ ముసుగులో చిత్ర ప్రథమార్థంలో వచ్చిబూతు సన్నివేశాలు, మాటలు కుటుంబ సమేతంగా ఈ చిత్రానికి వెళ్లిన వారికి ఉక్కిరిబిక్కిరి చేసేస్తాయి. తెలుగు సినిమాల్లో ఈ మధ్య మొదలైన 'పంచ్' డైలాగులు జనానికి అర్థం కావని కాబోలు గ్రాఫిక్స్ సహకారంతో పంచ్‌లుగా తెరపై చూపిన తెలివిని దర్శకుడు కూచిపూడి వెంకట్ చిత్రం సరిగ్గా తీయడంలో చూపి వుంటే ఫలితం మరోలా వుండేది. ఒక యువతిని వుద్దేశించి ఈ బుక్ మీరు చదివి నాకివ్వండి, 60+లో వాళ్లు చూడడమేగాని, ఏంచేస్తారు? డబ్బులుంటే డైనింగ్ టేబుల్ మీద వేసుకోవచ్చు ఇది ఎంత మంది పంచ్ డైలాగులో వినేవారందరికి తెలిసిపోతాయి. హీరో అప్పారావులో మోహావేశానికి థర్మామీటర్ కొలబద్దగా చూపడం, కాల్ సెంటర్లలో పనిచేసే అమ్మాయిలు బ్రోతల్స్‌గా, రెండోపెళ్లి చేసుకొనే మహిళలను రంగేళిరాణులుగా చూపిన



జాన్ అప్పారావ్ 40 + చిత్రంలో సిమ్రాన్, కృష్ణభగవాన్.

తీరు హర్షణీయం కాదు. ఒకప్పటి గ్లామర్ హీరోయిన్ సిమ్రాన్ సహకారంతో చిత్రాన్ని లాక్కొరావాలని ఆమె కృష్ణభగవాన్ కాంబినేషన్‌లో మామూలు పాటల మాదిరిగా పెట్టిన మేఘాలలో తేలి పొమ్మని (గులాబి), ఓ బంగరు రంగుల చిలుక (తోట రాముడు), నిను కోరి వర్షం (ఘర్షణ), ఎన్నెన్నో జన్మల బంధం (నోము) రీమిక్స్ పాటలు వర్క్ ఔట్ కాలేదు.

అసలు సిమ్రాన్ గ్లామర్ డ్రస్సులలో చాలా వికారంగా వుంది. ముఖంలో కళా కాంతి లేవు. అయితే ద్వితీయార్థంతో ఆలీ, రఘుబాబు, వేణుమాధవ్ కాంబినేషన్‌లో నడిపిన హాస్యం ఒకింత బాగుంది. ఈనాడు సంస్థలలో పని చేస్తూ కామెడీ నటుడైన మేల్కొటేను ఈ చిత్రంలో చూపిన తీరు బాగోలేదు. వయస్సును బట్టి మేల్కొటే ఇటువంటి పాత్రలు ఒప్పుకోక వుంటే బాగుంటుంది.

చిత్రకథలోకి వెళ్తే విశాఖపట్నంలో అప్పారావు (కృష్ణభగవాన్) పేరుగాంచిన ఫ్యాషన్ టైలర్. చెల్లెళ్ళకు పెళ్లి చేసే క్రమంలో 40 ఏళ్లు దాటినా పెళ్లి చేసుకోలేకపోతాడు. చెల్లెళ్ల పెళ్లి తర్వాత కొన్ని సంబంధాలను చూడను వెళ్లి నానా మాటలు పడతాడు. ఈ దశలో తన డ్రస్ డిజైన్ చేయమని లండన్ నుంచి బిబిసి విలేకరి ప్రవల్లిక (సిమ్రాన్), అప్పారావు వద్దకు వస్తుంది. అతనితో చనువుగా మెలిగేసరికి అప్పారావు ఆలోచనలు ఎక్కడికో వెళ్లిపోతాయి. ఆమె లండన్‌లో ఓ ఫ్యాషన్ డిజైన్ షాపు ప్రారంభిద్దామన్న సలహాయిచ్చేసరికి అన్నీ వదులుకొని ఆమెతో బయలుదేరుతాడు. ఇక్కడే కథ ఓ మలుపు తిరుగుతుంది. జాన్ (కృష్ణభగవాన్), రజాక్ (షియాజి షిండే) పేరుగాంచిన టెర్రరిస్టులు. హైదరాబాద్ మెహిదీపట్నం రైతు బజార్‌లో అంతర్జాతీయ తీవ్రవాదుల ఆదేశాల మీద బాంబులుపెట్టి పలువురి మరణానికి కారకులవుతారు. మరికొన్ని చోట్ల బాంబులు పెట్టి దుబాయ్ వెళ్లాలనుకొనే జాన్, తన ఇంటర్వ్యూ కావాలన్న ప్రవల్లికతో తనను పోలి వుండే అప్పారావును అప్పగించమంటాడు. అప్పారావును చంపేసి తాను చనిపోయి

తొరవ 14వ పేజీలో

# తిని లావయ్యాను



తెలుగు సినిమాల్లో నటించే సమయంలో హీరోయిన్ నమిత చాలా సన్నగా వుండేది. ఇప్పుడు చాలా లావయ్యింది. విపరీతంగా లావవ్వడంతో ఆమెకు తమిళంలో అవకాశాలు వెల్లువెత్తుతున్నాయనవచ్చు. కానీ ఈ అవకాశాలు ఎల్లకాలం వుండవు కదా? ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన నమితను విపరీతంగా లావైన విషయమై అడిగితే; నిన్న మొన్నటి వరకు నేను ఆడపిల్లనన్న విషయం నాకు గుర్తుండేది కాదు. దీన్ని మరోలా అనుకోకండి. నా కజిన్లు 25 మంది అబ్బాయిలే. అందువల్లే నేను అబ్బాయిలా పెరిగాను. లంచ్‌కు కూర్చుంటే కనీసం ఎనిమిది, తొమ్మిది చపాతీలు తినకుండా లేచేదాన్ని కాదు. కడుపు నిండా తిని... కంటి నిండా నిద్రపోతే ఎలాంటి రోగాలు దరిచేరవు అన్న పెద్దోళ్లమాట పాటించబట్టే ఇలా అయ్యాను. ఇప్పుడు తిండి తగ్గించాను. యోగా చేస్తున్నాను. కొన్నాళ్లకు తగ్గుతానులెండి అని చమత్కరించింది నమిత.

# ప్రియుళ్లను మార్చేస్తుంది!



ఓంశాంతి ఓమ్ చిత్రంలో హీరోయిన్ దీపికాపదుకొనే సినిమాల్లోకి రాక ముందు వాణిజ్య ప్రకటనల్లో నటించింది. ఈ సమయంలో ఆమెకో బాయ్‌ఫ్రెండ్ వుండేవాడు. చెట్టాపట్టా లేసుకొని తిరిగారు. సినిమాల్లోకి ప్రవేశించగానే ఈ బాయ్ ఫ్రెండ్‌ను వదిలేసింది. ఓం శాంతి ఓమ్ విజయం సాధించాక క్రికెటర్లు యువరాజ్‌సింగ్, ధోని ఈమె ప్రేమ కోసం తహతహ లాడారు. కానీ ఈ సుందరాంగి మాత్రం యువరాజ్ వైపే మొగ్గుచూపింది. దీపికా స్నేహంతో యువరాజ్ ఫామ్ కోల్పోయాడు; దీపిక దూరమైంది. ప్రస్తుతం ఈమె వర్ధమాన హీరో రణబీర్‌కపూర్‌తో డేటింగ్ చేస్తోంది. ముంబాయిలోని స్టార్ హోటళ్లలో వీరిద్దరూ తరచూ కనిపిస్తున్నారట. మరో సంగతేమంటే వీరిద్దరూ కలసి యశ్‌రాజ్ ఫిలిమ్స్ నిర్మిస్తున్న సినిమాలో నటిస్తున్నారు. ప్రస్తుతం దీపిక మూడో నెంబర్ ప్రేమికుడితో కులాసాగా వుంది.



# ఇక చూపను

తెలుగమ్మాయి అశోక్, జై చిరంజీవ చిత్రాల్లో హీరోయిన్ సమీరా రెడ్డికి బాలీవుడ్‌లోనే క్రేజ్ జాస్తి. హిందీలో ఆమె నటించిన వన్ టూ త్రీ, రేస్ చిత్రాలు విడుదల కావాల్సివుంది. అనంత్ మహదేవన్ తీస్తున్న 'రెడ్ అలర్ట్' లో ఈ గ్లామర్ డాల్ నక్సలైట్‌గా నటిస్తోంది. ఈ పాత్రను సమీరా చాలా ఇష్టంగా పోషిస్తుంది. దీన్ని గూర్చి వివరిస్తూ ఈ చిత్రంలో నేను లక్ష్మి అనే నక్సలైట్‌గా కనిపిస్తా; గ్లామర్, కామెడీ అసలు వుండదు. నేను ఆంధ్రా అమ్మాయిని కావడం వల్ల దర్శకుడు ఈ పాత్రను ఆఫర్ చేసినట్లుంది. రేస్ చిత్రంలోనూ నాకు పాటలు లేవు. మీకో విషయం చెప్పాలి. జంజీర్ చిత్రంలో అమితాబచ్చన్‌కు పాటలు లేవు. బ్లాక్‌లో రాణీ ముఖర్జీకి పాటలున్నాయా? ఒకే రకం పాత్రలు ఎన్నాళ్లు పోషించమంటారంటుంది.

# అందని ఇలియానా!

మెరుపుతీగకు జీవం పోస్తే హీరోయిన్ ఇలియానాలా వుంటుందనవచ్చు. తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని పొందిన హీరోయిన్ ఇలియానాను దేవదాసు, పోకిరి చిత్రాలు తారాపథంలో అగ్రస్థానంలో నిలిపాయి. ఖతర్నాక్ చిత్రంతో తాను ఎన్నో పాఠాలు నేర్చుకొన్నానంటుంది ఇలియానా. హీరోయిన్‌గా ఆమె క్రేజ్ ఆకాశాన్ని తాకింది. డిమాండ్ బాగా వుంది. దీంతో రెమ్యునరేషన్ కోటి రూపాయలు చేసినా నిర్మాతలు పెద్దగా పట్టించుకోవడం లేదు. పవన్ కళ్యాణ్ హీరోగా ఈ నెలాఖరులో విడుదలయ్యే 'జల్సా' చిత్రంతో పాటు తరుణ్ సరసన మరో చిత్రంలో ఇలియానా నటిస్తుంది. ఈ చిత్రాలు హిట్ కాక మునుపే హిందీ చిత్రాలను చూసుకొని కోటిని మించి ఇలియానా డిమాండ్ చేస్తుండడంతో తెలుగు నిర్మాతలు లబోదిబో మంటున్నారు. ఇలియానాలా క్రేజున్న హీరోయిన్లు పరిశ్రమలో లేకపోవడంతో నెత్తి నోరు బాదుకుంటున్నారు.



# తనుశ్రీ తిప్పలు



హీరో బాలకృష్ణ సరసన ఓ చిత్రంలో నటించిన హీరోయిన్ తనుశ్రీ రాయ్ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. ఇప్పుడీ సుందరి రుబ్బురాయిలా తయారయ్యి తెగ ఇబ్బంది పడుతుంది. విపరీతంగా లావెక్కడంతో అవకాశాలు కరువయ్యాయి. ఈ బాధ తట్టుకోలేక ఇటీవల ఆమె తన సహనటి కొయినామిత్రను సలహా అడిగిందట. దీంతో ఆమె తను కొన్ని మాత్రలు వేసుకొని బరువు తగ్గినట్లు చెప్పడంతో తనుశ్రీ వాటిని తెప్పించుకొని తిందట. ఈ మాత్రల వల్ల వచ్చే సైడ్‌ఎఫెక్ట్ గూర్చి కొయినా ఆమెకు చెప్పలేదు. దీంతో 'సాస్ బహూ ఔర్ సెన్సెక్స్' షూటింగ్‌లో వున్న తనుశ్రీని మత్తు ఆవరించిందట. ఒక్క షాట్‌కు 20 టేకులు తింది. దీంతో దర్శకుడు తనుశ్రీ మత్తు మందు తీసుకొని సెట్స్‌కు వచ్చిందని ఆగ్రహాన్ని వ్యక్తం చేశాడట. సన్నబడేందుకు ట్రెడ్‌మిల్స్‌ను ఆశ్రయించాలి గానీ, ఇలా మాత్రలు వేసుకోవడం ఎందుకంటున్నారు బాలీవుడ్ జనాలు.

# వ్యాంప్‌గా కష్టం



టి.వి సీరియల్స్ చూసేవారికి భువనేశ్వరిని ప్రత్యేకంగా పరిచయం చేయనక్కరలేదు. వీటిలో లేడి విలన్‌గా నటించే ఈమె అందరినీ ఆకట్టుకొంది. ఇటీవల భాగ్యలక్ష్మి బంపర్‌డ్రా, సీమశాస్త్రి, కృష్ణార్జున, నగరం చిత్రాల్లో వ్యాంప్‌గా కనిపించిన భువనేశ్వరి ఇక నుంచి సినిమాల్లోనే నటిస్తానంటుంది. కుర్‌కురే చిత్రం షూటింగ్ గ్యాప్‌లో పిచ్చాపాటీగా మాట్లాడుతూ నేను చెన్నైలో పుట్టి పెరిగాను. ఇక్కడే ప్రముఖ వస్త్ర దుకాణాలకు మోడల్‌గా పనిచేశాను. దర్శకుడు వంశీ పిలిచి దొంగరాముడు అండ్ పార్టీలో అవకాశమిచ్చారు. అప్పటి నుంచి అవకాశాలు వస్తూనే వున్నాయి. నేను పోషించే వ్యాంప్ పాత్రలు ఇష్టపడడం వల్ల వాటిలో నటిస్తున్నాను. నిజానికి అలాంటి పాత్రల్లో నటించడం అంత సులభం కాదు. చాలా జాగ్రత్తగా పాత్ర పోషించాల్సి వుంటుంది. ఈ పాత్రలు పోషిస్తున్నానని చిన్న చూపు చూడకండి; ఆదరించమంటుంది భువనేశ్వరి.

# హృదయపూర్వక కృతజ్ఞతలు



మా ఆహ్వానాన్ని మన్నించి తమ అమూల్యకాలాన్ని వెచ్చించి
మా కుమార్తె శ్రీమతి **విజయ - రవిచంద్ర** ల వివాహానికి
విచ్చేసి నిండు మనస్సుతో దీవెనలను అందజేసినందులకు
మాన్యశ్రీ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
గౌ॥ డాక్టర **వైఎస్ రాజశేఖర్‌రెడ్డి** గారికి
కేంద్ర మరియు రాష్ట్ర మంత్రి వర్యులకు, పార్లమెంటుసభ్యులకు,
శాసనసభ్యులకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు,
శ్రేయోభిలాషులకు మరియు బంధుమిత్రులకు
మా హృదయపూర్వక కృతజ్ఞతలు.

సూళ్ళూరుపేట నియోజకవర్గ ప్రజలందరికి
మా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసుకొంటూ ఎల్లప్పుడూ
మీ ఆత్మీయ అభిమానం ఇలాగే ఉండాలని కోరుకొంటూ...





మీ....

**శ్రీ నెలవల సుబ్రహ్మణ్యం - శ్రీమతి అమృతసరళ**
**సూళ్ళూరుపేట శాసనసభ్యులు**



# శుభాకాంక్షలు

తనకంటూ ఓ వ్యక్తిత్వం
తనదంటూ ఓ విశిష్ట లక్షణం!
కృషివుంటే మనుషులు ఋషులవుతారని
లోకానికి చాటిచెప్పిన మహా ఋషి,
మహోన్నత మనీషి
శ్రీ **టి.సుబ్బిరామిరెడ్డి** గారు
రెండవసారి రాజ్యసభ సభ్యులుగా
ఎన్నికైన శుభసందర్భాంగా...
మా శుభాకాంక్షలు

**దుప్పూరు శివకుమార్‌రెడ్డి**
నెల్లూరు.

Edited, Printed and Published by N. Dolendra Prasad, Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.